


పాలడుగు
వెంకటేశ్వరరావు

"బాబూ! చలపతిరావుగారున్నారా?"

ఆ ప్రశ్నని సుబ్బారావు మూడోసారి అడిగాడు; దాంతో మేఘం గర్జించింది. ప్రళయం విరుచుకుపడింది. కుర్చీలో కాళ్ళు బారచాచుకుని సుఖంగా నిద్ర పోతున్న ఆముసలాయన కళ్ళు తెరిచి చూశాడు. ఆచూపు సుబ్బారావుని కాల్చి వేసేట్టుంది. కిందనుంచి పైకి ఒకసారి సుబ్బారావుని పరీక్షగా చూసి, మొహం చిట్లించాడాయన. బయట మధ్యాహ్నపు ఎండ తీక్షణంగా వుంది. వరండాలో చల్లగా, హాయిగా వుంది.

"ఏమయ్యా? ఎవరు కావాలి? వేళా పాళాలేదూ? ఇంతకీ నువ్వెవరివి?" తీక్షణంగావచ్చిన ఆమాటలు సుబ్బారావుకి అసహ్యం కలిగించాయి. మంచీలేదు, మర్యాదాలేదు.

'ఎండనపడి వచ్చావు. మంచినీళ్ళు

తాగుతావా ?' అన్న పరామర్శలేదు. ఏం మనిషి ?

ఆ ముసలాయనమీద సుబ్బారావుకి ఉవ్వెత్తున కోపంవచ్చింది. తన కోపాన్ని నిగ్రహించుకున్నాడు, ప్రయత్నంమీద. అవసరం తనది. తొందరపడితే అసలు వచ్చినపనే విఘ్నం కావచ్చు.

"చలపతిరావుగారిని కలుసుకుందామని వచ్చాను సార్!" అన్నాడు. సుబ్బారావు.

"వాడు నిద్రపోతున్నాడు నీకు వాణ్ని కలుసుకోవటానికి ఈవేళే దొరికిందా ? ఈ రోజుల్లో కుర్రాళ్ళకి సమయం సందర్భం లేదయ్యా ? అ(, కాసేపయ్యాక వాడు నిద్రలేస్తాడు." అని ముక్తసరిగా అని తిరిగి నిద్రలోకి జారిపోయాడు ఆ ముసలాయన.

ఆ ముసలాయన కెదురుగా రెండు కుర్చీలు ఖాళీగా వున్నాయి, అందులో ఒకదానిలో కూర్చుని చలపతిరావుగారు నిద్రలేచేదాకా ఆగుదామా అనుకున్నాడు సుబ్బారావు. ఆ ఆలోచన అతనికి 'కంపరం' కలిగించింది. ఆ ముసలాయనకి ఎదురుగా కూర్చుని చూస్తూ వుండాలన్న ఆలోచనని తోసివేశాడు సుబ్బారావు, మనసులోంచి.

లావుగా, ఎర్రగా యాభయ్యోపడిలో పడ్తూన్న శరీరం; నుదుట పంగనామాలు. ఆమొహం నిద్రలోకూడా క్రోధాన్ని వెలిగ్రక్కుతూవుంది. కొంతమంది వూరికే చిటపటలాడుతారు. ఎదటివాడు ఏమనుకుంటాడో అన్న ఆలోచనే వుండదు. ఆ రకానికి చెందినవాడు ఈ ముసలాయన. అటువంటి వాళ్ళంటే సుబ్బారావుకి అసహ్యం.

అందుకే గబగబా వెనక్కి తిరిగి ఎండలోకి అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు సుబ్బారావు.

సాయంత్రం నాలుగున్నరదాకా అక్కడక్కడా తిరిగి, మళ్ళీ ఆ ఇంటిగడప తొక్కాడు సుబ్బారావు.

చిన్న బంగళాముందు రకరకాల పూలమొక్కలు. కిటికీలకి వట్టివేళ్ళ తడికలు. లోపల ఫానులు తిరుగుతూన్న ధ్వని. ఆ బంగళాలో మెత్తటి పరుపుమీద పడుకుని నిద్రపోతారు గావును చలపతిరావుగారు.

ఆయన కేం? పెద్ద ఆఫీసరు. హోదా, దర్జా, డబ్బూ వున్నవాడు. చేతిలో పలుకుబడి వున్నది. కాలు తీసి క్రిందపెట్ట నవసరంలేదు.

'చలపతిరావుగారు నిద్ర లేచారో లేదో?' అనుకుంటూ మెట్లెక్కి వరండాలోకి వెళ్ళాడు సుబ్బారావు.

ఏదయితే ఎదురు పడకూడదని మనస్సులో కోరుకున్నాడో అదే ఎదురయింది సుబ్బారావుకి. గతుక్కుమన్నాడు !

ముసలాయన అక్కడే కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు తాపీగా.

"నమస్కారం సార్ !" అన్నాడు

సుబ్బారావు, ఆయన్ని మనస్సులోనేతిట్టుకుంటూ. 'ఆనాడు వసుదేవుడు కూడా గాడిదకాళ్ళు పట్టుకున్నాట్ట!' అని సమాధాన పడ్డాడు తనలో తాను.

"ఆఁ. ఎవరూ ?'' ఐదునిముషాల తర్వాత ఆయన తల పైకెత్తాడు.

''చలపతిరావుగారు నిద్ర లేచారాండీ ?'' వినయంగా అడిగేడు సుబ్బారావు.

"ఇంతకీ నువ్వెవరు ? నీపని ఏమిటి? ఆసంగతి చెప్పవయ్యా ?'' ఆరంభంలోనే హంసపాదు !

"వారిని కల్సుకుని మాట్లాడాలండీ!" అన్నాడు సుబ్బారావు.

"అంతేగాని ఇంకెవరితోనూ మాట్లాడ వన్నమాట !" బాణంలాగా వచ్చింది ఆయన మాట.

సుబ్బారావు మౌనంగా వుండిపోయాడు. 'ఇంతకీ తవఁ రెవరు?' అని అందామనుకుని నోటిదాకావచ్చిన మాటని మింగేశాడు.

''ఆహాఁ. సరే," అంటూ "అయితే, వాడు అరగంటక్రితమే ఆఫీసుకి వెళ్ళిపోయాడు,'' అని చుట్ట వెలిగించుకుని పొగ పీల్చుతున్నా డాయన, అరమోడ్పు కళ్ళతో.

'ఈ ముసలాళ్ళతో వచ్చిని చాద స్తమే ఇది ! 'కుర్రా'ళ్ళని తేలిగ్గా తీసిపారేస్తారు. చలపతిరావుగారిని 'వాడు' అని సంబోధిస్తున్నాడు ! ఈ పెద్దమనిషి వారికి అన్నగారవుతాడేమో! లేకపోతే తండ్రా? ఎవరయినా ఈ ముసలాయనతో తనకి చావు వచ్చిపడింది,' అనుకుని విసుక్కుంటూ వెనక్కి తిరిగాడు సుబ్బారావు. ఆతర్వాత రెండురోజులు తిరిగినా చలపతిరావుగారి దర్శనమే అవలేదు !

సుబ్బారావుకి సోమసుందరంగారి మీద కోపంవచ్చింది

''నీ కెందుకు ? నువ్వు వెళ్ళి చలపతిరావుని కల్సుకో. అతను నాకు బాగా తెలుసు ! నేను వుత్తరంకూడా రాస్తాను. ఈ వుత్తరం తీసుకెళ్ళి ఆయన్ని కలుసుకుని నాపేరు చెప్పి ఇవ్వు. మర్నాటికి నీకు ఆర్డరు చేతి కొస్తుంది,'' అని బలవంతం చేసి సుబ్బారావుని రైలెక్కించా డాయన.

సోమసుందరంగారు సుబ్బారావుకి పిల్లనిచ్చిన మామగారు. రెండేళ్ళనుంచీ, బి. ఏ. పాసై, ఏదిదొరికినా చాలునని అడ్డమయిన ప్రతి వుద్యోగానికీ దరఖాస్తులు పెట్టి విసుకెత్తి వున్నాడు సుబ్బారావు.

కొన్నిటికి ఇంటర్వ్యూలు వచ్చాయి. కాని ఉద్యోగం దొరకలేదు. కొన్నిటికి ఇంటర్వ్యూకూడా లేదు.

'నాయనా ! ఈరోజుల్లో ప్రతిదానికీ 'రికమెండేషన్' కావాలి. లేకపోతే నీకు ఉద్యోగమిచ్చేవాడు ఎవరు ఈరోజుల్లో?' అన్న స్నేహితు డొకడి సలహాని తలదాల్చి కొన్నిటికి 'రికమెండేషన్' వుత్తరాలు తీసుకెళ్ళి ఆఫీసర్లని కలుసుకున్నాడు సుబ్బారావు.

వాళ్ళు సుబ్బారావుతో ఎంతో మర్యాదగా మాట్లాడేరు. వీలయినంత వరకూ సహాయం చేస్తామని హామీ లిచ్చేరు. ఉద్యోగమయితే ఇప్పించలేక పోయినా వాళ్లూ ఎంతో పెద్ద ఆఫీసర్లయినా, ఇంత అవమానకరంగా ఎవరూ ప్రవర్తించలేదు. చలపతిరావుగారిని రాహువులాగా పట్టుకున్న ఈ ముసలి మనిషి ఎవరు?

మొదటే ఉరుములాగా ఉరిమాడు ఆ ముసలిపీనుగు.

'చలపతిరావుగారు తనకి దర్శనం ఇప్పించకపోవటానికి ఆ ముసలాడే కారణమా అని' అనిపించింది సుబ్బారావుకి.

దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డం పడుతున్నాడు. ఆ ముసలాయన్ని ఏంచేసినా పాపంలేదు. ప్రతిసారీ అగ్నిహోత్రుడి లాగా ఎదురవుతాడు.

చలపతిరావుగారిని ఆఫీసులోనే కల్సుకుందా మనిపించింది. కాని ఆ పని చెయ్యొద్దనీ, ఇంటికెళ్ళి కల్సుకుంటేనే ఉచితంగా వుంటుందనీ మరీ మరీ చెప్పారు సోమసుందరంగారు. అది ఆయన చాదస్తం. 'వీళ్ళ చాదస్తాలవలన నేను ఇబ్బందిపడుతున్నాను,' అనుకున్నాడు సుబ్బారావు. ఆఫీసులోకూడా పిలవనేలేదు. ఆయన దొరకనేలేదు. ఏది ఏమయినాసరే ఆ మర్నాడే తిరిగి షూరికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు సుబ్బారావు. 'ఉద్యోగం సంగతి దేవుడెరుగు. ఆ మనిషే కనపడడు. 'వీళ్ళకీ, వీళ్ళ వుద్యోగాలకీ ఒక నమస్కారం,' అనుకుని ఆఖరుసారిగా ప్రయత్నం చేద్దామని తిరిగి ఆ యింటికి వెళ్ళాడు సుబ్బారావు. ఆ ముసలిపీనుగు ఆయనకి ఉత్తరమన్నా ఇవ్వనిస్తాడా? చేతిలో డబ్బుకూడా అయిపోవచ్చింది; టిక్కెట్టు డబ్బులుమాత్రం మిగిలాయి.

సుబ్బారావు వెళ్ళేసరికి సాయంత్రం ఆరున్నరయింది.

ఆ ముసలాయన ఇంటిముందు పూల మొక్కలమధ్యన కూర్చుని ఏవో చదువుకుంటున్నాడు. సుబ్బారావు క్రుంగిపోయాడు. 'ఇక ఈ ముసలిపీడ ఒదిలేట్టు లేదు. అపశకునమ్మనిషి' అని లోలోపలే తిట్టుకున్నాడు. సుబ్బారావుని చూసి ఆవాళ ఆయన ప్రసన్నంగా నవ్వాడు. ఆ నవ్వు ముళ్ళు గుచ్చిన ట్లుంది, సుబ్బారావుకి. నమస్కారంకూడా చెయ్యకుండా వెళ్ళి ఎదుట నిలబడ్డాడు.

సుబ్బారావుకి ఉద్యోగంమీద ఇక ఆశ లేదు.

'చలపతిరావుగారికీ, సోమసుందరం గారికీ ఒక నమస్కారం. అందరికంటె ముందు ఈ ముసలిపీనుక్కి నమస్కారం. ఉద్యోగంవద్దు; ఏమీ వద్దు. ఈ తిరుగుడు నేను తిరగలేను.' అనుకున్నాడు మనసులోనే.

నాలుగు నిముషాల తరువాత ఆయన




ము వ

పుస్తకంలోంచి తలెత్తి "ఏవోఁయ్, మళ్ళీ చలపతిరావు కోసమే వచ్చావా ?" అన్నాడు.

సుబ్బారావు కోపాన్నణుచుకుంటూ అవునన్నట్టు తల వూపాడు.

"అవునుగానీ అసలు నువ్వెవరు ? చలపతిరావుతో నీ కేం పని ? ఏ వూరి వాడివి ? ఎవరు పంపగా వచ్చావు ? ఆ సంగతి చెప్పవేమోయ్ ?" అన్నాడు ఆయన.



సుబ్బారావు మాట్లాడలేదు. ముసలాయనమీద కోపంతో మనసు వుడికి పోతోంది. ఆయనే తల్చుకుంటే తను చలపతిరావుగారిని కల్సుకోవటానికి మూడు నిముషాలు చాలు. కావాలనే ఈ మూడురోజులూ నాటక మాడుతున్నాడీయన. అటువంటి మనుషులంటే సుబ్బారావుకి అసలే అసహ్యం. ఏది ఏమి అయినా, సోమసుందరంగారిచ్చిన వుత్తరం చలపతిరావుగారికి అందచెయ్యాలి; అంతవరకే తనపని. ఇటువంటి నీచమయిన మనస్తత్వం గల వాళ్ళతో తనకు మాటలు అనవసరం.

"నేను బందర్నించి ఒకరిదగ్గర్నించి చలపతిరావుగారికి వుత్తరం తెచ్చాను," అని జేబులోంచి వుత్తరం తీశాడు సుబ్బారావు.

"ఎవరూ? సోమసుందరంగారా? ఆయన నాకు మంచి స్నేహితుడు," అన్నాడాయన. సుబ్బారావు ఆశ్చర్యపోయాడు. ఆ సంగతి ఈ ముసలిపీను గెలా గ్రహించాడు?

"అవును. ఈ వుత్తరం చలపతిరావుగారి కందజేస్తే కృతజ్ఞుణ్ణి," అని ఆయనకి ఉత్తరం ఇచ్చాడు సుబ్బారావు.

"ఓహో! సుబ్బారావ్! అయితే నువ్వు చలపతిరావుని కల్సుకోకుండానే వెళ్ళిపోతావా?" అన్నాడాయన నవ్వుతూ.

సుబ్బారావు మాట్లాడలేదు.

"ఇదంతా నా కెలా తెల్సిందని ఆశ్చర్యపోతున్నావా? చలపతిరావుకి వుత్తరం వచ్చిందట! ఇందాక టీ తాగుతూ నాతో అన్నాడు. అయినా ఏం కుర్రాళ్ళోయీ మీరు? ఇల్లాంటి వాళ్ళు ఉద్యోగాలు ఏంచేస్తారు? వోపిక లేదు, ధైర్యంలేదు. ముక్కుకు సూటిగా పోతారు?" అని ఆగి సుబ్బారావుని పరీక్షగా చూశాడాయన.

సుబ్బారావు మొహం కందగడ్డలా తయారయింది.

"మీకు చాలా థాంక్సండీ! వస్తాను," అని వెనక్కి తిరిగాడు.

"చలపతి ఇప్పుడే వస్తాడు. కాస్తాగవోయ్! కాఫీ పుచ్చుకెళ్దుగాని;" వెనకనించి ఆయన కేకేశాడు.

"మీ కాఫీకీ మీకూ నమస్కారం," అని కసిగా అని గబగబా నడిచి రోడ్డు మీద పడ్డాడు వడివడిగా నడుస్తూ.

ఆక్షణంలో ఆముసలాయన్ని నమిలి మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది సుబ్బారావుకి.

ఆ సంబోధన సుబ్బారావుని కాల్చివేసింది. ఆయన వయస్సులో పెద్దవాడే అగుగాక! చలపతిరావుగారికి అన్నో, తండ్రో అయితే అయివుండవచ్చుగాక! కాని అపరిచితుడయిన తనని అల్లా

పిలవటం, పుండుమీద కారంచల్లినట్లున్న అతని మాటలూ సుబ్బారావుకి అసహ్యమూ బాధా కలిగించినయ్!

ఆ జ్ఞాపకాల్ని మనసులోంచి తోసేశాడు. తక్షణం ఆవూరు ఒదిలిపెట్టాడు.

త్రోవలో ఒక మిత్రుడిదగ్గర దిగి, వారంరోజులపాటు కులాసాగా కాలక్షేపం చేసి ఇంటికి వెళ్ళిన సుబ్బారావుకి అత్తగారింట్లో వీరోచిత స్వాగతం లభించింది. ఉద్యోగం దొరికిన పురుషుడని ఆతన్ని భార్యామణి నెత్తిమీద పెట్టుకుంది. సుబ్బారావు అయోమయంలో పడ్డాడు.

ఆరాత్రి భోజనందగ్గర సోమసుందరంగారు సుబ్బారావుతో ప్రస్తావించారు.

"ఎప్పుడు బయలుదేరుతున్నావు?"

"ఎక్కడికి?!" అన్నాడు సుబ్బారావు.

"అదే! హైదరాబాదు. నువ్వింకా చూళ్ళేదా? నేను చెప్పానుగదా! చలపతిరావుగారు తల్చుకుంటే పని ఇట్టే అయిపోతుందని. మొన్ననే 'ఆర్డరు' వచ్చింది. వారంలోగా చేరాలిట! నిన్ననే ఆయనదగ్గర్నుంచికూడా నాకు వుత్తరం వచ్చింది. నువ్వు ఆయన్ని కల్సుకున్నావటకదా! నీ వోపిక్కి మెచ్చుకున్నాడాయన! ఏపనిలోనైనా రాణించాలంటే వోపిక ముఖ్యమంటాడాయన. ఛోంచెయ్యి. అవన్నీ చూసుకుందువుగాని..."

"నేనా?! చలపతిరావుగారు నాకు కనపడనేలేదే?!" అన్నాడు సుబ్బారావు.

"అదేమిటి?" అన్నారు సోమసుందరంగారు.

"ఆయన్ని కల్సుకుందామని మూడు రోజులు ప్రయత్నించాను. చివరికి విసుగేసి ఆఫీసులో కల్సుకుందామనీ ప్రయత్నించాను; వీలవలేదు. అప్లికేషను ఆఫీసులో ఇచ్చేసి వచ్చాను. వారి ఇంట్లో ఒక చాదస్తపు ముసలాయన నాకు అడ్డుపడ్డాడు. మీ వుత్తరం వారి కిమ్మని ఆ ముసలాయన కిచ్చి వొచ్చాను. అంతే! చలపతిరావుగారిని నేను కలుసుకోందే?" అన్నాడు సుబ్బారావు.

సోమసుందరంగారుం ఒకక్షణ తల తడుముకున్నారు ఎడంచేత్తో. మరుక్షణం ఆయన నవ్వుతున్నారు - ఆ సంగతి గ్రహింపయి.

"పిచ్చోడా! ఆ ముసలాయనే చలపతిరావుగారు. ఆయన పలుకు కొంచెం దూకుడుగా వుంటుంది అంతే! ఆయన ఇం కెవరనుకున్నావు మరి!?" అన్నారు. సుబ్బారావు మనసులో ముసలి చలపతిరావుగారూ, ఆయన ధోరణీ. మాటలూ మెదిలాయి.